## క్లుప్తంగా

### నేడు చలివేంద్రిలో 'గడప గడపకు..'

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభంకానున్న కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

### 'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేద్దాం

• ఎమ్మెల్యే కళావతి పిలుపు



వీరఘట్టం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంగళవారం నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు యువత ముందుకు రావాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. వండవ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జగనన్న సర్కారు 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, టెన్నీకాయిట్, మారథాన్, తదితర విభాగాల్లో ఫిబ్రవరి పదో తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణకు వంద కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కేటాయించారన్నారు.

### నేడు గుమ్మలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### నేడు క్రీడా పోటీలు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు మంగళవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ సర్వేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సచివాలయాల పరిధిలో క్రీడల కోసం రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారు ఉదయం 9 గంటలకు మైదానం వద్దకు చేరుకోవాలని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ క్రీడా పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు.

### రామాలయం ప్రారంభానికి సిద్ధం



శ్రీరామ మందిరం

మెంటాడ: మండల కేంద్రంలోని ఎగువవీధిలో నిర్మాణం పూర్తిచేసుకున్న రామ మందిరం ప్రారంభానికి సిద్ధమైంది. గ్రామస్తులు, పలువురు దాతల ఆర్థిక సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభం రోజునే ఈ ఆలయాన్ని ప్రారంభించనున్నట్లు గ్రామ పెద్దలు చెపుతున్నారు. ఈలోగా మిగిలిన పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

### 500 మంది పేదలకు వస్త్రదానం



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న జార్జి

రామభద్రపురం: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని ఆరికతోటలో విశ్రాంత ఎంఈఓ జార్జ్ పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ముందుగా స్థానిక ఏడీఎంఎం చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు చేశారు. అనంతరం చిన్నారులకు బహుమతులు, సుమారు 500 మంది పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జార్జి మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ చేసినప్పటి నుంచి ఏటా క్రిస్మస్ పర్వదినం నాడు పేదలకు దుస్తులు, భోజనాలు అందిస్తున్నానని అన్నారు. పేదలకు సాయం చేయడంలో ఉన్న సంతృప్తి మరెందులోనూ ఉండదని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ రెవ్ ఎస్.ఇజ్రాయెల్, సురేష్‌కుమార్, చంద్రశేఖర్, పి.భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు క్రిస్మస్ శుభాకాంక్షలు

సీతానగరం: క్రిస్టస్ పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు నివాసంలో సోమవారం జరిగిన వేడుకల్లో ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ ఎంబాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు,వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ,పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు ఆధ్వర్యంలో వేలాది మంది కార్యకర్తలు,అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బి.రమణమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు ఏసుక్రీస్తు ఆయురారోగ్యాగ్యాలు ప్రసాదించాలని, భవిష్యత్‌లో ఉన్న శిఖరాలకు ఎదిగే విధంగా దీవించాలని కోరుకున్నామన్నారు. క్రిస్మస్ రోజున ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియ జేయడం ఆనందంగా ఉందనిన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు శాసనసభ్యుడిగా ఉండడంతో మండలంలోని గ్రామాలు అభివృద్ధికి నోచుకున్నాయన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.



సీతానగరం: ఎమ్మెల్యే అలజంగి జోగారావును సత్కరిస్తున్న ఎంపీపీ.రమణమ్మ, జెడ్పీటీసీ బాబ్జీ, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

#### వాడవాడలా క్రిస్మస్ వేడుకలు

మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం రాత్రి ప్రారంభమైన క్రిస్మస్ ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం బాల ఏసుజన్మదిన వేడుక ఘనంగా జరిగింది. ఈ మేరకు చినభోగిలి ఆర్సీఎం చర్చి ఫాదర్ వర్గీస్ పర్యవేక్షణలో బాల ఏసును పల్లకిలో అధిష్ఠించి క్రైస్తవ భక్తులు కురమాన శ్రీనివాసరావు, సర్పంచ్ కె.రాధ ఆధ్వర్యంలో పురవీధుల్లో వందలాది మంది క్రైస్తవులు ఊరేగింపు చేశారు. అలాగే లచ్చయ్యపేట, అంటిపేట,ఆర్ వెంకంపేట, బూర్జ, పెదభోగిలి, పెదంకలాం, గాదెలవలస, కేఎల్ పురం, గెడ్డలుప్పి, బగ్గందొరవలస చర్చిల్లో పాదర్స్ పర్యవేక్షణలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

#### సోదర భావమే క్రీస్తు సందేశం

పార్వతీపురంటౌన్: తోటి వ్యక్తులపట్ల సోదర భావాన్ని చూపించి కష్ట సుఖాల్లో పాలుపంచుకోవడమే ఏసుకీస్తు సందేశమని సాటి మానవులపట్ల కరుణ, దయ కలిగి ఉండి ద్వేషభావాన్ని విడనాడాలని పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు సోమవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక క్యాంప్ కార్యాలయంలో క్రిస్మస్ కేక్ చేసి పండగను అందరి మధ్యలో జరుపుకున్నారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన విందుకు నియోజకవర్గంలోని ప్రజలు, అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో మూడు మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లు, మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



దొర్లతాడివలసలో జరుగుతున్న క్రిస్మస్ సంబరాలు



మక్కువ: విద్యుత్ కాంతుల నడుమ మక్కువ ఆర్‌సీఎం చర్చి



సీతానగరం: చినభోగిలిలో బాల ఏసును పల్లకిలో ఊరేగిస్తున్న క్రైస్తవ భక్తులు



మక్కువ: ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

#### సాలూరులో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

సాలూరు: క్రిస్‌మస్ వేడుకలు సోమవారం పట్టణం, మండలంలో ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని కురుకూటి పంచాయతీ దొర్లతాడివలస గ్రామంలో కో ఆప్షన్ సభ్యుడు, పాస్టర్ సువార్తరావు ఆధ్వర్యంలో వేడుకగా క్రిస్మస్ సంబరాలు జరిగాయి.

#### మక్కువలో..

మక్కువ: మండలంలోని అన్ని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రార్థనాలయాల్లో ఏసుక్రీస్తు జీవిత చరిత్ర గురించి చర్చి ఫాదర్లు వివరించారు. స్థానిక ఆర్సీఎం చర్చిలో ఉదయం నుంచి క్రైస్తవ ఆరాధనలో విశ్వాసకులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

## వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరి

పార్వతీపురం టౌన్: వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరి, ప్రజల రక్షణ కోసమే రోడ్డు భద్రతా నియమాలు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని ట్రాఫిక్ ఎస్సై పాపారావు అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఆర్‌టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు భద్రత, రక్షణ, అతి వేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు. రహదారిపై ద్విచక్ర వాహనాలు నడుపుతున్నవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, ఎక్కువ స్పీడ్‌తో వెళ్లవద్దని, తప్పని సరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని హితవు పలికారు. ఓవర్ లోడ్‌తో వాహనాలు నడవరాదని హెచ్చరించారు. సరుకు రవాణా వాహనాలలో ప్రజారవాణా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సైలు

## ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన వరి పంటను రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దళారుల బారిన పడి ఆర్థికంగా నష్ట పోవద్దని ఏఓ ఎస్.అవినాష్ చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ పొలాల్లో వరిసాగు చేసి పంంట కోతకు వచ్చి నూర్పు చేసిన ధాన్యాన్ని పౌర సరఫరాలశాఖ పర్యవేక్షణలో నిర్దేశించిన ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే మిల్లర్లు ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని రెండుగ్రామాల్లో రైతులు మధ్య వర్తులకు ధాన్యం విక్రయిస్తున్నట్లు తెలియవచ్చిందని, అలా విక్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని, ప్రభుత్వం విధిగా కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



మండలకేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ ఎస్.అవినాష్

## ఏజెన్సీలో 'కందికొత్తల' సందడి



కురుపాం: ఏజన్సీలో కందికొత్తల పండగ సందడి మొదలైంది. గిరిజనులు చేసే వ్యవసాయంలో ముఖ్య భూమిక పోషించే గొడ్డలి (గొడ్డలమ్మ తల్లి)ను గిరిశిఖర గ్రామాల్లో డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇందులో భాగంగా జి.శివడ పంచాయతీ మద్దుగూడ గ్రామంలో సోమవారం అడవి నుంచి గొడ్డలమ్మను, సత్తారమ్మను గ్రామానికి తీసుకువచ్చి పండించిన పంటలను నైవేద్యంగా పెట్టి పూజలు చేశారు. అనంతరం గిరిజనులు భోజనాలు చేశారు. ఐదు రోజుల తరువాత తిరిగి గ్రామదేవతలను అడవిలో విడిచిపెడతారు. ఏటా సంక్రాంతికి ముందు గిరిజనులు కందికొత్తల పండగను ఘనంగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది.

గొడ్డలమ్మ తల్లిని ఊరేగిస్తున్న గిరిజనం

## అంబఖండిలో 'వికసిత్ భారత్'



ప్రకృతి సాగుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలో అంబఖండి గ్రామంలో సోమవారం 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పంచాయతీ కార్యదర్శి హేమసుందరరావు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాసపు గోవిందనాయుడు, ఎంపీటీసీ పుర్లి సత్యవతి, వ్యవసాయశాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### పారదర్శకంగా 'వైఎస్సార్ కల్యాణమస్తు'



లబ్ధిదారుకు కల్యాణమస్తు చెక్కు అందజేస్తున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: వైఎస్సార్ కల్యాణమస్తు పథకాన్ని పూర్తి పారదర్శకంగా అమలు చేస్తున్నామని, అర్హులకు ఈ పథకం కింద కచ్చితంగా లబ్ధి చేకూరుతుందని వైకేపీ ఏపీఎం పి.గోవిందరావు అన్నారు. మండలంలోని సంకిలి గ్రామంలో వైఎస్సార్ కల్యాణమస్తు పథకం లబ్ధిదారు కొయ్యాన భారతికి సోమవారం రూ.50 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### గురవాంలో గ్రామసభ



గ్రామసభలో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీ దొర

రాజాం: మండలంలోని గురవాం గ్రామంలో మూడురోజులుగా చేపట్టిన 16వ సోషల్ ఆడిట్‌పై సోమవారం గ్రామసభ నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో గురువాం పంచాయతీలో రూ.68 లక్షలతో 32 పనులు చేపట్టినట్లు డీఆర్పీ దొర తెలిపారు. ఆయా నిధుల వినియోగం, రికార్డులు, ఎం-బుక్‌లు, పనులను పరిశీలించినట్లు చెప్పారు. గ్రామ సభలో సేకరించిన వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఏపీఓ సాయిరాం, ఎస్ఆర్పీ ఎన్.చిన్నబ్బాయి, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

### లైన్‌సోయింగ్ పద్ధతితో అధిక దిగుబడి



లైన్‌సోయింగ్ విధానంలో నాట్లు వేస్తున్న రైతులు

రాజాం సిటీ: ప్రకృతి వ్యవసాయ విధానంలో గులిరాగి సాగుచేయడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని ఎంటీ కిరణ్‌కుమార్, ఎల్1 రమాదేవి సూచించారు. మండలంలోని పొగిరి పంచాయతీ బొద్దవలసలో ప్రకృతి సాగులో భాగంగా లైన్‌సోయింగ్ పద్ధతిలో నాట్లు వేసే విధానంపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. గులిరాగి సాగులో మెళకువలను వివరించారు. ముందుగా నేలను తేలికపాటి దుక్కి చేసుకుని ఘనజీవామృతాన్ని చల్లుకోవాలి. నారును బీజామృతంలో శుద్ధి చేసి లైన్‌సోయింగ్ పద్ధతిలో నాట్లు వేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం వల్ల అధికంగా పిలకలు రావడంతో పాటు దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పాత్రుని వెంకటరమణ, నిర్మల పాల్గొన్నారు.

## జీజీఎంపీ రెండో విడత నిధులతో
# అభివృద్ధి పనులు



తామరఖండి వద్ద జరుగుతున్న రోడ్డు పనులు, (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: పార్వతీపురం నియోజకవర్గం పరిధిలోఉన్న మూడు మండలాలకు చెందిన గ్రామాల్లో ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి గడపగడపకు మనప్రభుత్వం పథకం నిధుల ద్వారా సర్పంచ్‌లు, నిర్వాహకులు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం మండలాలకు చెందిన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గడపగడపకు మనప్రభుత్వం పథకం ద్వారా రెండో విడతలో విడుదలైన రూ.15 కోట్ల నిధులతో పనులను చేపట్టవలసి ఉందన్నారు. అలాగే సీతానగరం మండలంలో అసంపూర్తిగా ఉన్న కృష్ణారాయపురం, తామరఖండి–బక్కుపేట గ్రామాల్లో రోడ్ల నిర్మాణం పూర్తి చేయడానికి నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు.

### శ్రీరాముడు మార్గదర్శకుడు

పాలకొండ రూరల్: శ్రీరాముడు మార్గదర్శకుడని ప్రముఖ ఆధ్యాత్మిక వక్త జడ్డు జగ్గారావు అన్నారు. అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలు, రాముని చిత్ర పటాలను వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మండల పరిధిలో ఆలయాలకు పంపిణీ చేయాలని సూచించారు. మండలంలోని కొండాపురం రామాలయంలో సమరసత సేవా సభ్యులు, హిందూ మత ప్రచారకులు, గీతా సత్సంఘ సభ్యులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామ మందిర నిర్మాణ ప్రాముఖ్యతపై చర్చించారు. సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు స్వామి చింతా భాస్కరనాయుడు, డి.యోగీశ్వరరావు, మన్మధరావు, కె.జనార్దనరావు, సురేంద్ర, తదితరులున్నారు.



అయోధ్య నుంచి వచ్చిన అంక్షతలు, రాముని చిత్రపటాలను పంపిణీకి సిద్ధం చేస్తున్న సమరసత సేవా సభ్యులు

## రుణాలను సద్వినియోగం చేసుకోండి



వెంకటరంగారాయపురంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల ద్వారా మంజూరు చేస్తున్న రుణాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం గోవిందరావు అన్నారు. మండలంలో వెంకటరంగారాయపురం, కొత్తచెలికానివలస, పాతచెలికానివలస తదితర గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో సోమవారం సమావేశాలు నిర్వహించారు. స్త్రీనిధి, ఏఎంఈజీపీ, బ్యాంకు లింకేజీ రుణాలపై అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలతో జీవనోపాధి యూనిట్లు నెలకొల్పి ఆర్థికంగా బలోపేతం కావాలని, రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామైక్య సంఘాల మహిళలు, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.